
# మాస్టర్ ఎం.ఎన్.

## మాస్టర్ సి.వి.వి. యోగ మార్గమున ధ్రువతార



# ముందుమాట

బొమ్మలకీ, రంగులకీ, కథలకీ, పుస్తకాలకీ బాల్యంతో ఒక విడదీయలేని సంబంధం ఉంటుంది. అప్పుడే వికసిస్తున్న మనసులకి ఆలోచనలను, ఊహలను, కలలను, సృజనాత్మకతను పరిచయం చేస్తాయి. నీతికథలు, చారిత్రక కథలు, విలువలని అందించే కథలు, వ్యక్తిత్వాన్ని పెంపొందించే కథలు, రామాయణ, భారత, పురాణాల కథలు వారి జీవితాలపై చెరగని ముద్ర వేస్తాయి.

చందమామ, అమర చిత్ర కథ పుస్తకాలు మొదలైనవి కొన్ని తరాలుగా పిల్లలను చైతన్యపరుస్తూ ఆకట్టుకుంటూ ఉన్నాయి.

అదే కోవలో పిల్లలకు మాస్టర్ సి.వి.వి., మాస్టర్ ఎం.ఎన్., మాస్టర్ ఇ.కె. వంటి మహాత్ముల జీవితాలను కథల పుస్తకం రూపంలో పరిచయం చేయడానికి ఒక వినయపూర్వకమైన ప్రయత్నం చేస్తున్నాము. వారి జీవిత సంఘటనలను వివరించడంగా మాత్రమే కాక, వారి బోధనలలో ఆచరణ సులభమైన చిన్ని చిన్ని విషయాలను జోడించి వారి దివ్య జీవితం మనకు ఏ రకంగా అనుసరణీయమో తెలియజెప్పటం ధ్యేయంగా జీవితకథలు రూపొందించబడ్డాయి.

ఈ జీవిత చరిత్రను పిల్లలు సులభంగా అర్థం చేసుకునేలా తయారు చేయడంలో సృజనాత్మక స్వేచ్ఛ తీసుకోబడింది. మా ఈ ప్రయత్నం పిల్లల అవగాహనకు ఎంతో దోహదపడగలదని విశ్వసిస్తున్నాము.

ఈ పుస్తకాన్ని సిద్ధం చేయడంలో విషయ సేకరణ, ప్రూఫ్ రీడింగ్, అనువాదము, ధన సహాయములతో సహకరించిన సోదర బృందమునకు మా కృతజ్ఞతలు.

**డాక్టర్ కె. పార్వతీకుమార్ గారి రచనలు, ప్రవచనాల ఆధారంగా ఈ పుస్తకాన్ని సంకలనం చేశాము.**

విషయ సేకరణకై పరిశీలించిన ఇతర గ్రంథములు:
1. మాస్టర్ సి.వి.వి. - రచన: మాస్టర్ ఇ.కె
2. మహాపురుష మాస్టర్ ఎం.ఎన్. - రచన: శ్రీ దామరాజు హనుమంత రావు.

**చిత్రకారుడు**
ఆర్టిస్ట్ సత్య గన్నోజు

**విలువ**
అమూల్యం

**ప్రచురణ**
ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ - గ్లోబల్, స్విట్జర్లాండ్.

**సర్వహక్కులు**
© 2025, ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ - గ్లోబల్, స్విట్జర్లాండ్.

ఈ ఎలక్ట్రానిక్ పుస్తకం https://worldteachertrust.org/en/web/publications లో ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంది.

ఒకప్పుడు నెల్లూరు జిల్లా నాయుడుపేట తాలూకాలో ప్రశాంతమైన మైనంపాడు గ్రామంలో శ్రీ శేషయ్య, శ్రీమతి రంగమ్మ దంపతులు ఉండేవారు. వారికి 1883 ఆగస్టు 25వ తేదీ శనివారం ఉదయం 9:30 గంటలకు ఒక కుమారుడు జన్మించాడు. ఆ అబ్బాయికి "జ్వాలా నరసింహం" అని పేరు పెట్టారు.




అతను కోస్తా గ్రామమైన కొత్తపట్నంలో పెరిగి, తన తండ్రి నిర్వహించే పాఠశాలలో చదివారు. బాల్యంలో శ్రీ నరసింహం తెలివైనవారు. ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఉత్సాహంతో ఉండేవారు. అతనికి చదవడం, వ్రాయడం, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అన్వేషించడం అంటే ఎంతో ఇష్టంగా ఉండేది.





మాధ్యమిక పాఠశాల నాటికి శ్రీ నరసింహం  ఒంగోలు చేరి, తర్వాత రాజమండ్రికి వెళ్లి చదువుకున్నారు. అక్కడ అతను తన మేనమామలు శ్రీరాములు, ప్రకాశం, జానకిరామయ్యల వద్ద నివసించారు.




అతని మేనమామ శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారు ధైర్యశాలి, బాగా చదువుకున్నవారు. బ్రిటిష్ పాలకులపై నిర్భయంగా పోరాడిన నాయకుడిగా "ఆంధ్రకేసరి"గా ప్రసిద్ధి చెందారు. ధైర్యంగా, ఆనందంగా, న్యాయంగా జీవించాలని ఆయన ఆ బాలుడికి బోధించారు.




శ్రీ నరసింహం మహామేధావి, చురుకైన విద్యార్థి! పాఠశాలలో అద్భుతంగా రాణించి అనేక పారితోషికాలు గెలుచుకున్నారు. అతనికి చదువంటే అంటే ఎంతో ఇష్టం, ఎప్పుడూ కొత్త విషయాలను తెలుసుకోవాలని తపనతో ఉండేవారు.




పై చదువులు మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదువుకున్న శ్రీ నరసింహం అక్కడ తన తెలివితేటలు, చిలిపి అల్లరులతో ప్రసిద్ధి చెందారు. వినోదంతో పాటు తన చదువుల విషయంలో కూడా గంభీరంగా వ్యవహరించేవారు.




1905లో శ్రీ నరసింహం ప్రథమ శ్రేణిలో నిలిచి భౌతికశాస్త్రంలో పట్టభద్రుడయ్యారు. 1907 నాటికి విజయవాడలో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి తన బోధనా శైలితో అక్కడ విద్యార్థులకు చేరువయ్యారు.






అదే సంవత్సరం, శ్రీమతి రంగనాయకమ్మను వివాహమాడి గృహస్థ జీవితం ప్రారంభించారు.





వారికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు జన్మించారు. శ్రీ నరసింహం ప్రజలకు సహాయం చేయాలనే కోరికతో న్యాయశాస్త్రం చదవాలని నిర్ణయించుకున్నారు. న్యాయశాస్త్ర పట్టభద్రుడయిన తరువాత ఒంగోలు పట్టణంలో న్యాయవాద వృత్తిని ప్రారంభించి దయగల, నిజాయితీ గల న్యాయవాదిగా పేరు తెచ్చుకున్నారు. వారు ఫీజు తీసుకునే విధానం ప్రత్యేకంగా ఉండేది. డబ్బు గురించి ఎన్నడూ ఆందోళన చెందేవారు కాదు.
లాయరు గారూ!! మీకు ఫీజు ఎంత ఇమ్మంటారు?
ఇంత అని లేదు. మీకు అనిపించినది ఆ కోటు జేబులో పెట్టి వెళ్ళవచ్చు
శ్రీ నరసింహం తన జీవితంలో ఒక వ్యక్తిగత విపత్తును ఎదుర్కొన్నారు. దాదాపు మూడు సంవత్సరాల వ్యవధిలో తన తల్లిదండ్రులను, మామగారిని, అన్నను కోల్పోయారు. దీనితో వారు ఎంతో నిరాశ నిస్పృహలకు లోనయ్యారు.
కుటుంబాన్ని కోల్పోవడంతో "జీవితానికి ప్రయోజనం ఏమిటి? అసలు మనుషులు ఎందుకు మరణిస్తారు?" వంటి ఎన్నో ప్రశ్నలు, ఆలోచనలు ఆయనను వెంటాడుతూ ఉండేవి.


1919లో, మేనమామ ప్రకాశంగారు శ్రీ నరసింహంను పుణ్యక్షేత్రమైన శ్రీరంగం ఆలయ పట్టణానికి ఆహ్వానించారు. కానీ అక్కడ ఒక అంటువ్యాధి వ్యాప్తి ఉన్నదని తెలియడంతో ఇంకొక మేనమామ అయిన డాక్టర్ జానకీరాం వద్ద చెన్నైలోనే ఆగిపోయారు. డాక్టర్ జానకీరాం చాలా సౌమ్యులు. దయాహృదయం కలిగిన హోమియోపతి వైద్యులు. ఆయన ప్రకాశం గారికి భిన్నంగా, మౌనంగా ఇతరులకు వైద్యం చేస్తూ, ప్రశాంతంగా ఉంటూ ఉండేవారు.




మాస్టర్ సి.వి.వి. గారి పరిచయం శ్రీ నరసింహం జీవితాన్నే మలుపు తిప్పిన ఒక మధురక్షణం. మాస్టర్ సి.వి.వి యోగంతో అమరత్వాన్ని పొందవచ్చని, తన స్వభావాన్ని బ్రహ్మముగా, శాశ్వత చైతన్యంగా గ్రహించవచ్చని డాక్టర్ జానకిరామ్ పలికారు.
మనం సాధారణంగా శరీరం ఒక్కటే అని అనుకుంటాం, కానీ వాస్తవానికి మూడు ఉన్నాయి: స్థూల, సూక్ష్మ మరియు కారణ శరీరాలు.
పాలలోంచి వెన్న వస్తుంది, వెన్నలోంచి నెయ్యి వస్తుంది కదా? అవి ఎక్కడ ఉన్నాయి? పాలలోనే ఉన్నాయి. పాలను స్థూల శరీరంగా, వెన్నను సూక్ష్మ శరీరంగా, నెయ్యిని కారణ శరీరంగా భావించవచ్చు.
"పెరుగు చిలికితే వెన్న తయారవుతుంది. ఆ వెన్న పెరుగులో, మజ్జిగలో కలవదు, పైకి తేలుతుంది. అదేవిధంగా, ఈ యోగాన్ని అభ్యసించినప్పుడు, సూక్ష్మ శరీరం ఏర్పడుతుంది. భౌతికశరీరంలోనే ఉంటూ, దానితో సంభంధం లేకుండా ఉంటుంది. అదే మరణాన్ని అధిగమించడం."
నా యోగాన్ని అభ్యసిస్తూ ఉన్నట్లయితే, నీవు ఒక సూక్ష్మ శరీరాన్ని/బంగారు శరీరాన్ని, ఒక కారణ శరీరాన్ని/వజ్ర శరీరాన్ని పొందుతావు. ఇది నా వాగ్దానం.


మాస్టర్ సి.వి.వి. గారి మార్గం శరీరాన్ని విడిచిపెట్టటం గురించి కాదనీ, ఆధ్యాత్మిక జీవనాన్ని గడపటం ద్వారా యోగంతో మరణాన్ని దాటగలగటం సాధ్యమే అన్న జానకిరామయ్య గారి మాటలకు శ్రీ నరసింహం మంత్రముగ్ధులయ్యారు.





డాక్టర్ జానకీరామ్, శ్రీ నరసింహం కుంభకోణం చేరుకున్నారు. వారు 'యోగా స్కూల్ ఫ్రెండ్స్ సొసైటీ' చేరే సరికి గుమ్మం వద్ద మాస్టరుగారు ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్లు నిలుచుని ఉన్నారు. మాస్టారుకు అప్పటికే డాక్టర్ జానకిరామ్ పరిచయం కాబట్టి చిరునవ్వుతో శుభాకాంక్షలు తెలిపి శ్రీ నరసింహంను చూస్తూ ఇలా అడిగారు:
ఏమి ఆశించి వచ్చావు?
నేను శాంతి కోరి వచ్చాను.
అనుగ్రహించాను! లోనికి రా.
మాస్టరు లోపలికి వెళ్ళిపోగా ఎం.ఎన్. ఆశ్చర్యంగా నిలబడ్డారు. ఇన్నాళ్లూ తాను అనుభవించిన వేదన, బాధలన్నీ తక్షణమే మాయమైపోయి, గుండెల్లో ఎంతో ప్రశాంతత, ఆనందం కలిగింది.


డిసెంబర్ 29, 1919న, సాయంత్రం 4:00 గంటలకు, మాస్టర్ సి.వి.వి. గారు దీక్ష నిచ్చా రు. జీవితానికి ఒక కొత్త దిశానిర్దేశం చేసి సాధారణ శ్రీ నరసింహం నుండి మాస్టర్ ఎం.ఎన్.గా మారడానికి బీజం పడిన మహాద్భుత క్షణం అది.




దీక్షా కార్యక్రమం ఎంతో గూఢంగా సాగింది. తన వెన్నెముకలో ఏదో విద్యుత్ ప్రవాహం కదలినట్లు, తన లోపల ఏదో సర్దుబాట్లు జరుగుతున్నట్లు శ్రీ నరసింహం గమనించారు.

శరీరం అంతా తేలిక అయి, అప్రయత్నంగా ధ్యానంలోకి ప్రవేశించారు శ్రీ నరసింహం. ప్రార్థన జరుగుతున్నప్పుడు ఒక వేడిమిని అనుభవించిన ఆయన అలా ఎంతసేపు కూర్చున్నారో తెలియదు.






కళ్ళు తెరిచి చూసేసరికి సి.వి.వి. గారు తన వైపు ఆహ్లాదకరమైన చిరునవ్వుతో చూస్తున్నారు.




మాస్టర్ సి.వి.వి. తన అనుయాయులను వారి పొడి అక్షరాలతో పిలిచేవారు. ఆయన ఎం.ఎన్ గారికి మీడియం నెంబర్ 666 ను కేటాయించి, ప్రార్థన కార్డును అందించారు.



Telegrams:—"MASTER" Kumbakonam.
MASTER C. V. VENCASAMI RAO.

666
29-12-19.

YOGA SCHOOL.
DABIR EAST STREET,
Kumbakonam.


PRARTHANA.
MASTER C. V. V.
NAMASKARAM
Please Rectify
and develop
my system.

ప్రార్థన
మాస్టరు సి. వి. వి.
నమస్కారము.
నా శరీరప్రకృతిని వ్యవస్థచేసి
ఉద్ధరింప వేడుచున్నాను.

కుంభకోణం నుంచి తిరిగివచ్చిన తర్వాత సబ్ కోర్టు తరలింపుతో ఒంగోలు నుంచి బాపట్లకు ఎం.ఎన్. గారు మకాం మార్చారు. కొత్త ఇంటిలో, మాస్టర్ సి.వి.వి. గారికి ఒక ప్రార్థనా గదిని కేటాయించారు.

మద్రాసుకు తిరుగు ప్రయాణంలో ఎం.ఎన్., డాక్టర్ జానకిరామ్ లు మాటలకు ఒక అందని ఆనంద స్థితిలో ఉన్నారు. అనేక ప్రశ్నలతో సతమతమైన పూర్వపు ఎం.ఎన్, మాస్టర్ గారిని కలిసి ప్రశాంతతను పొంది శిష్యుడిగా రూపాంతరం చెందారు.







బాపట్లలో ఏడుగురితో ఎం.ఎన్. సామూహిక ప్రార్థనలు ప్రారంభించారు. ఆ ప్రార్థనలు ఎంతో వేడిమిని పుట్టించి, దీర్ఘకాలికమైన, గాఢమైన ప్రభావం కలిగి ఉండేవి.



యోగ సాధనకు, వృత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకుంటూ ఎం.ఎన్. తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించేవారు. అవసరం అనిపించినపుడెల్లా కుంభకోణం వెళ్లి మాస్టర్ సి.వి.వి. గారితో సందేహనివృత్తి చేసుకునేవారు.




ఉత్తర ప్రత్యుత్తరములు, ఫోన్ సంభాషణలో మాస్టర్ గారి మార్గదర్శనం కోరుతూ ఉండేవారు ఎం.ఎన్. గారు.




ఎం.ఎన్. గారి ఆకర్షణీయమైన వ్యక్తిత్వం ఎందరినో ఈ యోగమార్గం వైపు ఆకర్షించింది. వారింట జరిగే ప్రార్థనలు ఎంతో ప్రభావం చూపటంతో మాస్టరు సి.వి.వి. గారి డైరక్టు అనుయాయులు, క్రొత్త సాధకులు కూడా ఎం.ఎన్. గారితో కలసి సామూహిక ప్రార్థనలలో పాల్గొనేవారు.



యోగాన్ని ఎంతో నిబద్ధతతో అనుసరించి కేవలం 3 సంవత్సరాల్లో ఆయన సాధించిన పురోగతిని గమనించి, 1921 లోనే ఎం.ఎన్. గారిని రాబోయే కాలానికి మాస్టర్ గా చూశారు మాస్టర్ సి.వి.వి. గారు.




ఆ రోజుల్లో ప్రార్థనలతో పాటు మాస్టర్ సి.వి.వి గారు ప్రత్యేక కోర్సులు కూడా నిర్వహించేవారు. తనతో ఉన్న అనుయాయుల కోసం కోర్సులను నిర్వహించడానికి ఎం.ఎన్. గారికి కూడా మాస్టర్ గారు అనుమతినిచ్చారు.




మాస్టర్ సి.వి.వి. గారు 1922 మే 12 న దేహత్యాగం చేసి అంతర్యామిత్వం చెందారు. ఎందరో వారి అంత్యక్రియలకు హాజరయ్యారు.



ఆ సమయం లో ఇకపై తమకు మార్గనిర్దేశనం ఎవరు చేస్తారు అని కొందరు దిగులు పడ్డారు.




మాస్టర్ ఎం.ఎన్. ధ్యానంలో ఆ బాధ్యతను తాను కొనసాగించి, అనుయాయులకు మార్గదర్శనం చేయవలసిన అవసరం ఉన్నది అని గ్రహించారు.




ఎం.ఎన్ గారు ఒంగోలులో ఒక విశాలమైన ఇంటిని నిర్మించి, 1927 మార్చి 21న "సత్యయోగ స్కూల్" ను ప్రారంభించారు.








ఒంగోలులోని సత్యయోగా స్కూల్ లో మాస్టర్ ఎం.ఎన్. గారి ప్రార్థనా మందిరం.

మాస్టర్ ఎం.ఎన్. ఒంగోలులో మే, ఆగష్టు, డిసెంబర్ నెలలలో పవిత్ర దినాలతో అనుసంధానించి యోగ సమావేశాలను నిర్వహించడంలో ముఖ్యపాత్ర పోషించారు. ఈ సమావేశాలు ఉత్సాహభరితమైన శక్తి కేంద్రాలుగా, కుంభ చైతన్యం ప్రవహించేలా ఏర్పాటు చేయబడ్డాయి.




మాస్టర్ ఎం.ఎన్. మార్గదర్శకత్వంలో సత్యయోగం అభివృద్ధి చెందింది. వారి ప్రభావం అన్ని ప్రాంతాలలో విస్తరించింది. సామూహిక సమావేశాలు, ప్రత్యేక ప్రార్థనాసమావేశాల ద్వారా అనేకమందిని ప్రభావితం చేసి, ఆధ్యాత్మికత వైపు, యోగచికిత్స వైపు నడిపించారు.





మాస్టర్ ఎం.ఎన్. గారు నెల్లూరు, ఒంగోలు, కర్నూల్ తదితర పట్టణాలు మరియు గ్రామాల్లో చేసిన ప్రయాణాలు సి.వి.వి. గారి చైతన్యవంతమైన ఆధ్యాత్మిక మార్గాన్ని పరిచయం చేసి శాశ్వతమైన ప్రభావాన్ని చూపాయి.
ఆధ్యాత్మిక పరిణామాన్ని వేగవంతం చేస్తానన్న మాస్టర్ సి.వి.వి. గారి బోధలు అనుసరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు ఎం.ఎన్. గారు. ఈ యోగం పన్నెండు జీవితకాలాలలో సాధించవలసిన పురోగతిని వేగవంతం చేసి కేవలం పన్నెండేళ్లలోనే సాధ్యమయ్యేలా పరివర్తనను తెస్తుంది అని అనుభవం ద్వారా తెలుసుకున్నారు ఎం.ఎన్.
పిడుగురాళ్ళ
సామూహిక ప్రార్థనలు, స్వప్నములు, బృందజీవనము లో ఒకరికొకరు నిస్వార్థముగా సహాయం చేయటం వంటి వాటితో కర్మను హరింపజేసుకొనవచ్చు అని మాస్టర్ సి.వి.వి. వినూత్న పద్ధతులను ప్రవేశపెట్టారు. ఈ సామూహిక కర్మరాహిత్య విధానం వ్యక్తిగత భారాన్ని తగ్గించి, యోగాభ్యాసం ప్రభావాన్ని మెరుగుపరుస్తుంది.


మాస్టర్ ఎం.ఎన్. నివాసం యోగాభ్యాసులకు ఒక ఆశ్రమంగా నిలిచేది. ఆధునిక సదుపాయాలు లేకపోయినప్పటికీ, ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూడా బృందములుగా వచ్చి రోజుల తరబడి ఉండే వారందరితో వారి వంటిల్లు ఎప్పుడూ పండుగ వాతావరణం తలపిస్తూ ఉండేది.




సామూహిక ప్రార్థనల సమయంలో, మాస్టర్ ఎం.ఎన్. గారి చికిత్సా సామర్థ్యాలు ప్రత్యేకంగా కనిపించేవి. ఆయన వ్యక్తుల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారి ఆరోగ్య స్థితి ప్రకారం తన ప్రార్థనలను సవరించి, మరింత సమర్థవంతమైన చికిత్సను అందించేవారు.




నిర్దిష్ట సమాచారం లేకపోయినా సామూహిక ప్రార్థనల సమయంలో పాల్గొనడానికి వచ్చినవారి వేర్వేరు ఆరోగ్య సమస్యలను కూడా గమనించి ప్రార్థనలోనే పరిష్కరించగలిగేవారు మాస్టర్ ఎం.ఎన్. వారి యోగచికిత్సాస్పర్శ దగ్గర లో ఉన్న వారికే కాక దూర తీరాలలో ఉన్న వారికి కూడా స్వస్థతనిచ్చేది.





అటువంటి చికిత్సకి ఉదాహరణ: విజయవాడలో మానసిక క్షోభకు గురైన ఓ మహిళ చిన్ననాటి నుండి అస్థిరమైన ప్రవర్తనతో బాధపడుతూ ఉండేది. ఆమెను గమనించి మాస్టరు గారు ప్రార్థన లో "స్థిరంగా ఉండు (Steady)" అని ఒక ధ్యాన వాక్యం పలికారు
ఆ ఆదేశంతో ఆమెకు వెంటనే పూర్తి స్థిరత్వం వచ్చింది. ఎన్నో ఏండ్లుగా నయం కాని మానసిక స్థితి రెండు రోజుల్లో తగ్గి ఆమె మామూలు కావడం ఆమె సోదరులను ఆశ్చర్యపరిచింది.
అనేక పట్టణాలలో యోగాకేంద్రములను స్థాపించడంలో మాస్టర్ ఎం.ఎన్. కీలక పాత్ర పోషించారు. ఈ కేంద్రాలను అభివృద్ధి చేస్తూ మూడవ తరం యోగాభ్యాసులు ముందుకు తీసుకెళ్తున్నారు.
మాస్టర్ ఎం.ఎన్. గారి బోధనలలో ప్రధానమైనది వినయం. యోగం అనేది వ్యక్తిగత సాధన కాదని, సామూహిక సాధన అని ఆయన తెలిపేవారు.
ఈ యోగపద్ధతి ఎద్దుల బండిలా నిదానంగా కాక విమానంలో ప్రయాణించడంలా ఆధ్యాత్మిక పురోగతిని వేగవంతం చేస్తుంది.
"నేను', 'నా', 'నాది' అన్న భావన నుండి ‘మనము’, 'మనది' అనే భావనకి పురోగమిస్తే అది ఐక్యతను, సామూహిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది


అనుయాయులు ఇతరులకు వైద్యం చేయడంలో కష్టపడినప్పుడు, మాస్టర్ (మాస్టర్ సి.వి.వి) గారే వైద్యం చేస్తున్నారు తాను కాదు అని నొక్కిచెప్పి, మార్గదర్శకత్వం చేసేవారు.





మాస్టర్ ఎం.ఎన్. 1934 విషువత్ ప్రార్థనా సమావేశాలలో సాధనలో మరొక మెట్టు ఎక్కారు. ఆ సంవత్సరం మార్చి 21న విజయవాడలో జరిగిన ఒక సమావేశంలో, ఉదయం 9:00 గంటలకు, మాస్టర్ ఎం.ఎన్. కు ఏదో కాలిన వాసన రా సాగింది.








విచిత్రంగా ఆ వాసన చుట్టుపక్కల ఎక్కడినుండో కాక, తన నుండే వచ్చింది అని, తానొక రకమైన ఆధ్యాత్మిక దహన సంస్కారానికి లోనయ్యానని గ్రహించారు.
తన చేతులను వాసన చూడమని ఇద్దరు అనుయాయులను అడిగగా వారు కాలిన వాసనను గమనించి ఆశ్చర్యపోయారు. ఏమి జరిగిందని వారు ఎం.ఎస్. గారిని అడిగారు.
అవును, నిజంగా కాలిన వాసనే.
ఇప్పుడు నా చేతిని వాసన చూడండి
ఆశ్చర్యం, ఇది కాలిన వాసన.
"నేను ఇప్పుడు స్వతంత్రుడనయ్యాను". ఇప్పుడు నేను "అక్షర పురుషుడిని" (నశించనివాడిని, శాశ్వతమైనవాడిని) అని వారితో అన్నారు.
ఆనాటి ప్రార్థన లో వారు కొత్త వాక్యాన్ని జతచేశారు.
"మాస్టర్ నమస్కారం",
"మాస్టర్ సి.వి.వి. నమస్కారం",
"మాస్టర్ ఎం.ఎస్. నమస్కారం".


1934లో ఆధ్యాత్మిక సాక్షాత్కారం పొందిన తర్వాత, మాస్టర్ ఎం. ఎన్. యోగ బోధనను ఉన్నత దశలోకి తీసుకువెళ్ళారు. పన్నెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం యోగ మార్గాన్ని శ్రద్ధగా అనుసరించిన అభ్యాసకులు ఇప్పుడు అంతర్గత మార్గదర్శకత్వం పొందవచ్చని తెలియజేశారు.





గుంటూరులోని ఒక ఇంట్లో సామూహిక ప్రార్థనా సమయంలో ప్రార్థన ప్రారంభమైన ఇరవై నాలుగు నిమిషాలకు, బృందంలోని ప్రతి సభ్యుడు ఒకే సమయంలో తమ చెంపపై ఎవరో ముద్దుపెట్టుకున్నట్లుగా ఒక ప్రత్యేకమైన అనుభూతిని పొందారు. అదేమిటని ప్రార్థనానంతరం అడిగినప్పుడు ఒక అయస్కాంతం తన సమీపంలోని అన్ని ఇనుప వస్తువులకూ అయస్కాంత శక్తిని పంచేట్లు, భౌతిక పరిమితులు లేకుండా చైతన్యాన్ని, అనుభూతినీ అందరికీ ఒకేమారు ప్రసారం చేయవచ్చు అని నిరూపించేందుకే ఈ విధంగా చేశానని చెప్పారు.




మాస్టర్ సి.వి.వి. గారి యోగ పరివ్యాప్తికి మాస్టర్ ఎం.ఎన్. గారు చేసిన కృషితో ఒంగోలు, గూడూరు, నెల్లూరు, కర్నూల్, ఆదోని, తెనాలి, బాపట్ల, గుంటూరు, విజయవాడ, పిడుగురాళ్ళ, గురజాల, రాజమండ్రి తదితర ప్రాంతాలలో అనేక యోగా కేంద్రాలు ప్రారంభమైనాయి.





తన ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, మాస్టర్ ఎం.ఎన్. ప్రార్థనలు, యోగ చికిత్సలలో పూర్తిగా నిమగ్నమై ఉండేవారు. తరచుగా ఉదయం 2 నుండీ 4 గంటల మధ్య స్పృహతో తన భౌతిక శరీరాన్ని వదిలి, తిరిగి వచ్చేవారు.



1936లో మాస్టర్ ఎం.ఎన్. ఆరోగ్య సమస్యను ఎదుర్కొన్నారు. 1936 మే 7 న శస్త్రచికిత్స పొందే సమయంలో మాస్టర్ ఎం.ఎన్.గారు మరణానికి చేరువలో ఉన్న స్థితిని అనుభవించారు. భౌతిక లోకానికి అతీతంగా శరీరరహితంగా తాను ఉన్న స్థితిని అనుభవించారు.




వారు తన సహచరులతో మాటల్లో 1940 మార్చి 11వ తేదీ గురించి సూచనప్రాయంగా తెలియజేసేవారు. సామాన్యంగా అందరిలో ఉండేటట్లే ఈ విషయం శిష్యుల జ్ఞప్తికి నిలవక మరుగున పడిపోయింది.




1940 మార్చి11 ప్రాముఖ్యతను సంకేతిస్తున్నారన్నట్లు ఉదయమే నిద్ర లేచి, శ్రద్ధగా తలస్నానం చేసి, కొత్త పట్టు బట్టలు, పట్టు తలపాగా ధరించారు. ఉదయపు ప్రార్థనలను ఉత్సాహంగా, ఆనందంతో నిర్వహించారు.




మాస్టర్ ఎం.ఎన్. ప్రత్యేకంగా తయారవడం గమనించిన శ్రీ రంగనాయకమ్మ గారు, ఆ నాటి ప్రత్యేకత ఏమిటని అడిగారు. మాస్టర్ గారు చిరునవ్వునే సమాధానంగా ఇచ్చి కోర్టుకు వెళ్లారు.




మధ్యాహ్నం 3:30 గంటలకు, మాస్టర్ ఎం.ఎన్. ఆఫీసు నుండి బయలుదేరి ఇంటికి తిరిగి వచ్చి 4 గంటల సమయంలో నేలపై ప్రార్థనకు కూర్చున్నారు. శ్రీ రంగనాయకమ్మగారు వారికి వెచ్చని కాఫీ సిద్ధం చేయడానికి వంటగదికి వెళ్లారు.




శ్రీ రంగనాయకమ్మ గారు కాఫీతో తిరిగి వచ్చేసరికి, మాస్టర్ ఎం.ఎన్. ప్రార్థన చేస్తూనే ఆమె ఒడిలో వాలిపోయారు.



సాయంత్రం కొంత మంది అనుయాయులు చేరుకున్నారు. కానీ తాము ఆలస్య మైనామని గ్రహించి చింతించారు. ఒక యోగి పూర్తి స్పృహతో శరీరాన్ని విడిచిపెట్టే గొప్ప క్షణాన్ని చూడలేకపోయినందుకు, మాస్టర్ ముందుగా తెలిపిన సంకేతాన్ని మరచినామని బాధ పడ్డారు.




మాస్టర్ ఎం.ఎన్. గారు దేహత్యాగం తర్వాత కూడా అగ్నికార్యం జరిగే ఆధ్యాత్మిక సమావేశములలో హోమ జ్వాలలలో వారి సాన్నిధ్యాన్ని అనుగ్రహిస్తూనే ఉన్నారు. చాలా మంది హోమంలో పాల్గొన్నప్పుడు ఈ అనుభుతి పొందినట్లు తెలిపారు. మాస్టర్ ఎం.ఎన్. గారి అదృశ్య హస్తం ప్రాక్పశ్చిమములలోని బృందములకు మార్గనిర్దేశం చేస్తున్నది.



1999లో అర్జెంటీనాలోని ఇగ్వాజు జలపాతం సమీపంలో జరిగిన హోమం సమయంలో మాస్టర్ ఎం.ఎన్. గారి యోగ చికిత్సకు సంబంధించి ఒక చెప్పుకోదగ్గ సంఘటన జరిగింది. ఇటీవల తన దృష్టిని కోల్పోయిన ఒక మహిళ హోమజ్వాలలో ఒక వ్యక్తి తన నుదిటిని తాకుతున్న దృశ్యాన్ని చూసింది. కళ్లు తెరిచి చూడగా తన చూపు తిరిగి వచ్చినట్లు గమనించినది. జ్వాలలలో తనను తాకిన వ్యక్తి ని ఫోటో లో చూసి ఆశ్చర్యపోయినది. ఎందుకంటే మాస్టర్ ఎం.ఎన్. గారిని తన జీవితం లో ఆమె చూడటం అదే మొదటి సారి.





# ఆలోచించు, ప్రతిస్పందించు: కథల నుండి పాఠాలు

కథలు కేవలం వినోదానికి పరిమితమయ్యేలా కాకుండా లోతైన అవగాహన అందించాలనే ఉద్దేశ్యంతో కథలోని ముఖ్యమైన విలువలపై దృష్టి పెడుతూ ప్రశ్నలు, సృజనాత్మక కార్యకలాపాలను ఇక్కడ జోడిస్తున్నాము. ఆసక్తి కలిగిన చిన్నారులు స్నేహితులు లేదా తమ కుటుంబ సభ్యులతో కథాంశాలను చర్చించటం ద్వారా కథతో వ్యక్తిగతంగా సంబంధం పెట్టుకోవచ్చు, మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. అర్థం కాని విషయాలను అడిగి తెలుసుకోవచ్చు. ఈ విధంగా ఆచరణకు వీలుగా అనుభవంగా మార్చడానికి ఇది ఒక చిన్ని ప్రయత్నం.

ఈ క్రింద ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.

1. ఇచ్చిన ఉదాహరణలో, పాలు, వెన్న, నెయ్యి మానవ శరీరంతో ఎలా పోల్చవచ్చు?.

........................................................................................ (పేజీ 6)

2. బంగారు శరీరం తయారు కావాలంటే అర్హతలు లేదా నియమాలు ఏమిటి?

........................................................................................ (పేజీ 7)

3. మాస్టర్ సి.వి.వి. శిష్యులకు ఏవిధంగా మార్గదర్శనం చేస్తారు?

........................................................................................ (పేజీ 11)

4. ఆధ్యాత్మిక పరిణామాన్ని వేగవంతం చేయడంలో, కర్మను హరింపజేయడం లో మాస్టర్ సి.వి.వి. గారి బోధనలు ఎలా సహాయపడ్డాయి?"

........................................................................................ (పేజీ 16)

5. మాస్టర్ ఎం.ఎన్. గారి బోధనలలో ప్రధానమైనది మనం ఎలా ఆచరణలో పెట్టగలం?

........................................................................................ (పేజీ 18)

మీ స్వంత వాక్యాల్లో (గరిష్టంగా 6 వాక్యాల లోపల), మాస్టర్ ఎం.ఎన్. వారి జీవితంనుంచి మీరు ఏమి నేర్చుకున్నారు వివరించండి.

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

ఈ పుస్తకంలో మీరు అర్థం చేసుకోలేకపోయిన లేదా స్పష్టత కావాలసిన అంశాలు ఉంటే, మీ ప్రశ్నలు లేదా సూచనలను దయచేసి ఈ ఈ-మెయిల్ కు పంపవచ్చు: **storybooks.feedback@gmail.com**


# <u>మాస్టర్ ఎం.ఎన్</u>

మాస్టర్ ఎం.ఎన్ అని ముద్దుగా పిలువబడే మైనంపాటి జ్వాలా నరసింహం గారు, మాస్టర్ సి.వి.వి. యోగంలో ఒక ధ్రువతార గా నిలిచి, ఆలోచన, మాట, నడవిడిక ఈ మూడింటిలోని స్వచ్ఛత ఆధారంగా యోగం నిర్వర్తింప చేస్తూ ఉంటారు. వృత్తిరీత్యా ఒక న్యాయవాది అయిన ఎం.ఎన్. గారు ప్రాణశక్తిని పెంపొందించే అనేక యోగ అద్భుతాలను ప్రదర్శించారు, అనుయాయులకు విభిన్న కోర్సులను అందించారు.

పరిపూర్ణ యోగిగా, ఉల్లాసభరితమైన రీతిలో ప్రార్థన సమయంలో స్వచ్ఛందంగా వారు తమ శరీరాన్ని విడిచిపెట్టారు.

---

## ఈ సిరీస్‌లోని ఇతర పుస్తకాలు







దీ వరల్డ్ టీచర్ ట్రస్ట్ - గ్లోబల్, స్విట్జర్లాండ్.